

# సునీతా ఓ సునీతా...

**కాలింగ్ బెల్ సవ్వడి విని సునీత సుతారంగా తలుపు తెరిచింది.**

**ఎదురుగా చిన్ననాటి స్నేహితురాలు భాను. సునీత ఆశ్చర్యంతో కెవ్వున అరవలేదు. వస్తున్నానని భాను ముందే ఉత్తరం రాసింది కాబట్టి.**

"ఎప్పుడే రావడం?"

"ఇదే, బస్టాండు నుంచి సిటీ బస్సెక్కి ఇక్కడికి రావడానికి మావూర్నుంచి పట్నానికెళ్ళినంత హైరానా పడాల్సొచ్చింది."

"సిటీ బస్సులో వచ్చావా?"

"మరి?"

"ఆటోలోనో, రిక్షాలోనో రావాల్సింది. సిటీ బస్సంటే అర గంటసేపు ఆర్టీసీకి మానాన్ని తాకట్టుపెట్టుకోడమే. మొన్నటికి మొన్న ఆటోలు స్ట్రయిక్ చేస్తే సిటీ బస్సెక్కాను. ఎంత నరకం అనుభవించానో. అంత రద్దీలో మగపురుగులు కొండచిలువల్లా.... ఛీఛీ-తలచుకొంటేనే అసహ్యంగా ఉంది. అందుకే నేనెప్పుడూ చస్తే సిటీ బస్సెక్కను."

సునీత చిన్నప్పట్నుంచీ అంతే. అన్ని విషయాలమీద అనర్గళంగా ఉపన్యసిస్తుంది. ఆ బుద్ధి ఇప్పటికీ పోలేదన్నమాట అనుకొంది పల్లెటూరి నేస్తం.

"ఏమిటే ఇలా లావెక్కిపోయావు. పల్లెటూళ్ళో ఏమీ తోచకపోతే తినడమేనా వ్యాపకం" సునీత జోకేసింది.

"మరీ అంత లావయ్యానా" భాను ఉత్కంఠగా అడిగింది.

ఆ తర్వాత పాఠకులు వినకుండా ఉండడమే మంచిది.

* * *

మధ్యాహ్నం బజారుకు బయలేరిన స్నేహితురాళ్ళ మధ్య మాటలు నడుస్తున్నాయి.

"నీ గురించి ఆయనకు నేనెప్పుడూ చెబుతుంటాను. నీకంత మంచి స్నేహితురాలుందా అని ఆయన ఆశ్చర్యపోతుంటారు" సునీత టాపిక్ మార్చింది.

భాను నవ్వి ఊరుకుంది. ఆమె చాలా ముక్తసరిగా మాట్లాడుతుంది.

"కొంత దూరం నడచిన తర్వాత ఆటోని పిల్చి నారాయణ్ గుడావైపు పోనివ్వమంది సునీత

సిటీబస్సుల్లో ఆడవాళ్ళకి జరుగుతున్న అవమానాల గురించి సునీత మళ్ళీ చెప్పనారంభించింది. ఆ సబ్జెక్ట్ మీద ఓ ఆంగ్ల దినపత్రికకు తను ఎంత ఘాటుగా, హృద్యంగా ఆర్టికల్ రాసిందో, ఆ ఆర్టికల్‌ను సమర్థిస్తూ ఎన్ని లేఖలు వచ్చాయో చెబుంటే భాను ఆసక్తిగా వింది.

"....లేడీస్ టైలర్" బోర్డు ఉన్నచోట ఆటో ఆగింది. చాలా పెద్దషాపు. సునీత హుందాగా నడిచివెళ్తుంటే మెడమీద టేపు వేసుకున్న ఓనరు వినయంగా విష్ చేశాడు.

ఇద్దరూ లోపలికివెళ్ళి సోఫాలో కూర్చున్నారు. షాపు కొత్త హంగుల గురించి సునీత అడిగి తెలుసుకుంది. ఓ చిన్న ఉపన్యాసం కూడా ఇచ్చింది. ఓనరు వినయంగా విన్నాడు.

మరి కొంత సేపటికి కళ్ళ ముందు దృశ్యానికి, పల్లెటూరి భాను ఆశ్చర్యానికి మధ్య ఆమె కళ్ళు మసకబారుతున్నాయి.

టైలరింగ్‌షాపు ఓనరు సునీత వీపు కొలిచిన తర్వాత ఆమె ముందుకొచ్చాడు.

భానుఆశ్చర్యానికి అవధుల్లేవు. ఆమె ఇటువంటి వాటి గురించి విన్నది. కానీ ఎప్పుడూ చూడలేదు. అదీ తన ప్రాణనేస్తం.... అటుకేసి భాను చూడలేకపోతోంది

పాత జాకెట్టు టైలరుకిచ్చి కొత్త జాకెట్టు కుట్టించుకోవడమే భానుకు తెలుసు.

టైలరు ఎదురుగా సునీత. టైలరు చేతుల్లోని టేపు ఎక్కడెక్కడో పరచుకొంటోంది. చుట్టూ అద్దాలు. ఎందరో సునీతలు' ఎందరో టైలర్లు. కళ్ళు తిప్పుకున్నా ఏదో ఓ అద్దంలో ఆ టేపులోని పది సెంటీమీటర్ల భాగం పాములా కన్పిస్తోంది. ఆ భాగం మీద ఆ టేపు....ఆ పుటే అక్కడ అంతసేపా!

భాను గబగబా బయటికొచ్చేసింది. కొంచెం సేపటికి వచ్చిన సునీత భాను భుజమ్మీద చెయ్యేసింది. ఆమె ఎప్పటిలాగే ఉంది.

"ఏమిటి బయటికొచ్చేశావు. లోపల ఉక్కపోస్తోంది కదూ" సునీత చాలా క్యాజువల్‌గా అడిగింది.

"మన వూరి కరణం గారమ్మాయి నారాయణగుడాలోనే ఉంటూంది" మళ్ళీ సునీతే మాట్లాడింది.

"ఆటో....ఆటో" సునీతే ఆటోని పిలుస్తోంది. ఆటో ఆగలేదు.

భాను నడుస్తుంటే సునీత వెంబడించింది.

బస్సుస్టాపులో నిలబడి భాను ప్రక్కనున్న సునీతవైపు చూసి పేలవంగా నవ్వింది.

"సిటీ బస్సే నయం, కదూ" అంటున్న భాను సునీతకు అర్థం కాలేదు. ●